ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.23.07.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.
2. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయాన్ని వివరించడానికి ముఖ్యంమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు, మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు.
3. వివిధ అంశాలపై ప్రతిపక్షాల గందరగోళం మధ్య లోక్ సభ ఈ మధ్యాహ్నాం 2 గంటల వరకు వాయిదా పడింది.
4. ప్రధానమంత్రి కుసుమ్ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు.

-------------------

**వానలు**

రాష్ట్రంలో నిన్నటి నుంచి ఎడతేరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి, జనజీవనం అస్తవ్యస్తమైంది, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రంలో అనేక జలాశయాలు నిండు కుండల్లా మారుతున్నాయి. కరీంగనర్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కరీంనగర్ అత్యధికంగా 126 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీవర్షాల నేపథ్యంలో సహాయ కార్యక్రమాల కోసం కలెక్టర్ కార్యాలయలో లో టోల్ ఫ్రీ నంబర్ 0878-2997247 ఏర్పాటు చేశారు. మా కరీంనగర్ విలేకరి మాట్లాడుతూ...

---------- **బైట్** --------

ఆసిఫాబాద్ జిల్లాలో నిన్న ఉదయం నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. తాజా సమాచారం ప్రకారం బెజ్జూర్ మండలంలో అత్యధికంగా 23 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతంగా అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

జగిత్యాల జిల్లాలో కడెం ప్రాజెక్ట్ నుంచి గోదావరి లోకి నీరు వదిలిన్నందువల్ల పరివాహక ప్రజలు అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే కాలువలు, వాగులు వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి వస్తున్న వరద నీటితో శ్రీశైలం జలాశయం నిండు కుండగా మారింది. దాదాపుగా లక్ష 25 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం తో పాటు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లద్వారా లక్షా 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో 24వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమ అవసరాల కోసం పోతిరెడ్డి పాడు ద్వారా వదులుతున్నారు.

నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా, కడపటి సమాచారం అందేసమయానికి 575 అడుగులకు చేరింది. కుడి, ఎడమ కాలువలతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం 5 వేల 685 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే మరో నాలుగైదు రోజుల్లో నాగార్జున సాగర్ గేట్లు తెరిచి నీగిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

భద్రాచలం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మడలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరద నీరు చేరడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కిన్నెరసాని జలాశానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 408 అడుగులు కాగా, ప్రస్తుతం 403.9 అడుగులుగా నమోదైంది. 4800 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని అధికారులు చెబుతున్నారు.

**డెస్క్/పీటీసీ, నల్గొండ, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, జగిత్యాల**

------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల్లో భారీ నుంచి అధి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

**డెస్క్**

--------------------

**సీఎం...రిజర్వేషన్లు**

రాష్ట్రంలో బీసీలకు ఎట్టి పరిస్థితుల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయమై ముఖ్యంమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి,రాజకీయకుల సర్వే తీరును, శాసనసభ ఆమోదించిన బిల్లులను వారికి వివరించారు. అంతకుముందు నిన్న విలేకరులతో మాట్లాడుతూ... ఈ అంశంపై ఇండియా కూటమిలోని పక్షాలను సమన్వయం చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో చర్చ జరిగినప్పుడు బీజేపీ సభ్యులు మద్దతు ఇచ్చారని, ఇప్పుడు ఆ పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వ్యతిరేకిస్తున్నారని, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వాటిని రద్దు చేసి మాట్లాడాలని ఆయన అన్నారు.

**డెస్క్....డీడీ...**

----------------------------

మంత్రివర్గ సమావేశం

మరోవైపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రేపు సాయంత్రం జరుగుతుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ఇతర పక్షాలతో సమన్వయం చేసుకుంటూ సాగడంపైనా, కులగణనపై నిపుణుల సంఘం ఇచ్చిన నివేదికపైనా చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల అంచనాలపై చర్చించి నిర్ణాయలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

డెస్క్

---------------------------

**BREAK**

ఆకాశవాణి వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

-----------------------

సిగాచి...పరిహారం

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ ప్రమాద మృతుల కుటుంబాలకు సంస్థ యాజమాన్యం దశల వారీగా మధ్యంతర పరిహారం అందచేస్తోంది. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సమక్షంలో నిన్న 15 కుటుం బాలకు 10 లక్షల రూపాయల వంతున అందచేసింది,.గత నెల 30న సంభవిం చిన ఘోర ప్రమాదంలో 48 మంది మరణించగా, 8 మంది జాడలేకుండా పోయారు. బాధిత కుటుంబాలకు విడతల వారీగా మధ్యంతర పరిహారం

అందచేస్తామని పరిశ్రమ సీఈవో, ఎండీ అమిత్ రాజ్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. జాడతెలియని కార్మికుల కుటుంబాలకు 15 లక్షల వంతున అందచేస్తామని పేర్కొన్నారు.

**డెస్క్**

------------------------

**LS – ADJOURN**

వివిధ అంశాలపై ప్రతిపక్షాల గందరగోళం కారణంగా లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశమైనప్పుడు, స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టారు. కానీ ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఇతర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్ లోకి దూసుకెళ్లారు. ప్రతిపక్షాల ప్రవర్తన సభ గౌరవానికి అనుగుణంగా లేదని పేర్కొంటూ ప్రశ్నోత్తరాల సమయాన్ని సజావుగా సాగనివ్వాలని ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు. సభకు అంతరాయం కలిగించడం, ప్లకార్డులు ప్రదర్శించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న సభ్యులు తిరిగి తమ సీట్లకు వెళ్లి కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయం పూర్తయిన తర్వాత, సభ్యులు ప్రస్తావించాలనుకుంటున్న అంశాలపై మాట్లాడటానికి అనుమతిస్తానని అన్నారు. అయినప్పటికి ప్రతిపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

**NSD**

------------------------

**పత్తి సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పత్తి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీని పై ముస్తాబాద్ మండలం వ్యవసాయ శాఖ అధికారి దుర్గారాజు ఆకాశవాణితో మాట్లాడుతూ...

------- **బైట్** -------

**పీటీసీ-రాజన్న సిరిసిల్ల**

-----------------------

కిషన్ –పీఎం కుసుమ్

రాష్ట్రంలో ప్రధాన మంత్రి-కుసుమ్ పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించి, రైతులకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రవేశపెట్టిన ఈ పథకం గడువు వచ్చే ఏడాదితో ముగియనుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా చొరవ తీసుకొని రాష్ట్ర రైతుల ప్రయోజనాలు కాపాడాలని కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం అదనంగా 450 మెగావాట్ల సామర్థ్యాన్ని ఆమోదించి, 20 వేల సౌరశక్తి పంపుసెట్లను మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ధన్యవాదాలు తెలిపారు.

**డెస్క్**

----------------------------

**ప్రధానమంత్రి సురక్ష బీమా**

అర్హులైన వారంత తప్పనిసరిగా ప్రధానమంత్రి బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన తీసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ సత్యనారాయణ

అన్నారు. ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ఆయన ఆ రోజు బీమా చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో మాట్లాడుతూ..

-------- **బైట్** --------

**పీటీసీ-మహబూబ్ నగర్**

---------------------------

ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో అర్హులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయిని, వాటి కోసం మధ్యవర్తులను ఆశ్రయించ వవద్దని గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలకు ఆయన స్పందిస్తూ...ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతోందని, దళారుల మాటలను నమ్మ వద్దని ఒక ప్రకటనలో కోరారు.

**డెస్క్**

-------------------------

**CLOSING**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

------------------